క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి నగర సంకీర్తన



దాచేపల్లి: శ్రీ లక్ష్మీ నరసింహస్వామి నగర సంకీర్తన కార్యక్రమం శనివారం నిర్వహించారు. లక్ష్మీ నరసింహస్వామి మాలధారులు ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రత్యేక పల్లకిపై స్వామి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి అలంకరణ చేశారు. అనంతరం మేళాతాళాలతో గ్రామపురవీధుల్లో సంకీర్తన చేశారు. స్వామివారి గీతాలతోభజపం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో నగర సంకీర్తనలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



మాచర్ల: పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అడిగొప్పల చెన్నకేశవ చారీ, కమిటీ పెద్దలు బండ్ల వెంకటేశ్వర్లు, బోయరామిరెడ్డి, రమణారెడ్డి, నర్సయ్యలు, మెట్టు రాధా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమీరా కృషి అభినందనీయం



మాచర్ల రూరల్: వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పదో తరగతి పరీక్షల్లో 596 మార్కులు సాధించి ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించిన షేక్ సమీరా కృషి ప్రశంసనీయమని తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ అన్నారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో 596 మార్కులు సాధించిన షేక్ సమీరాను శనివారం తహసీల్దార్ కార్యాలయంలో అభినందించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు విద్య, ఒత్తిడి లేని మానసిక దృఢత్వంతో ఉంటుందని క్రమశిక్షణ, ఒత్తిడి లేని విద్యను పొందటం వలన భవిష్యత్‌లో ఎటువంటి ఆటంకాలు ఎదురైనా సులభంగా దాటుకుంటూ పోతారని, రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకులో నిలిచేలా కృషి చేసిన ఉపాధ్యాయుల కృషి అమూల్యమన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి అల్లి సురేష్, ఉపాధ్యాయులు ఆయేషా సుల్తానా, తల్లిదండ్రులు జాన్ అబీదా పాల్గొన్నారు.

వైభవంగా నారసింహుడికి పూజలు



బెల్లంకొండ: మండలంలోని పులిచింతల ముంపు గ్రామమైన కేతవరంలో శనివారం వజ్ర లక్ష్మీ నారసింహ స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు జరిగి 16 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండ దిగువున గల ఆలయంలో వెంకటాద్రి నాయుడు పరిపాలనలో కోనేరులో లభ్యమైన చెంచులక్ష్మి సమేత పంచలోహ నరసింహస్వామికి కృష్ణానది జలాలతో పంచామృత అభిషేకాలను నిర్వహించారు. భక్తులు స్వామికి పొంగళ్లు చేసి నైవేద్యాలను సమర్పించారు. ఆలయ అర్చకులు దివి ప్రసన్నకుమార ఆచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో అవుదూరి వెంకటేశ్వరరెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నరసింహారెడ్డి, ఈమని వెంకటరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష పుష్పార్చన



నకరికల్లు: నర్సింగపాడులోని అయ్యప్పస్వామి సహిత గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి వేడుకను శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. స్వామివారిని విశేషంగా అలంకరించారు. మాస శివరాత్రి పురస్కరించుకొని స్వామికి లక్ష పుష్పార్చన విశేషంగా నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. పొంగళ్లు పొంగించి స్వామికి మొక్కులు చెల్లించారు.

కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో...

నర్సింగపాడులోని శ్రీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విశేష పూజాదికాలు నిర్వహించారు. స్వామికి మొక్కులు చెల్లించారు.

లక్ష్యం వైపు నడవడం అభినందనీయం

- వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ అశోక్‌కుమార్
- టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థుల అభినందన సభ
- చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు, వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో..



గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాల వైపు అడుగులు వేస్తూ ముందుకు సాగటం అభినందనీయమని చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ పేర్కొన్నారు. గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పదో తరగతితో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల అభినందన సభ ఆదివారం నిర్వహించారు. చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు, వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని పల్నాడు హాస్పిటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు తమ భవిష్యత్‌ను బంగారు బాటగా మర్చుకోవాలంటే అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు కష్టపడి చదవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు కూడా మంచిగా చదువుతున్నారని, అందులో బాలికల ఉత్తీర్ణత శాతంపై హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు వీరే...

గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారు వీరే... పిడుగురాళ్ల మండలం ఫస్ట్ జ్యోతిర్మయి 594 మార్కులు, ఎల్. వెంకట నరసింహారెడ్డి 592 మార్కులతో మండలం సెకెండ్, కె.రాజేష్ 591 మార్కులతో తృతీయ స్థానంలో ఉన్నారు. మాచవరం మండలంలోని మూలగుండ్ల సాక్షితారెడ్డి 589 మార్కులతో ఫస్ట్, గన్నవరపు ప్రణతి 582 మార్కులతో ద్వితీయ, బుడ్డిశెట్టి జ్ఞాన హర్షిత 581 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. దాచేపల్లి మండలంలో వై.ప్రణత్ 592 మార్కులతో మండలం ఫస్ట్, డి.అమూల్య 586 మార్కులతో ద్వితీయ స్థానం, ఎం.లక్ష్మీ పూజిత 585 మార్కులతో మండల తృతీయ స్థానం, గురజాల మండలంలో సీహెచ్ పూజిత హర్ష 594 మార్కులతో గురజాల మండలం ఫస్ట్, సీహెచ్ అశోక్ 591 మార్కులతో ద్వితీయ, ఎస్.సాయి మంజులా 589 మార్కులతో గురజాల మండల తృతీయ స్థానం సాధించారు.

ఐఐటీ సీటు లక్ష్యం



పదో తరగతిలో మంచి మార్కులు రావడం ఆనందంగా ఉంది. నా లక్ష్యం ఐఐటీ సీటు సాధించడం. మా పాఠశాల, తల్లిదండ్రులకు పేరు తీసుకువస్తా. అదే విధంగా దేశ సేవ చేసే అవకాశం వస్తుందని భావిస్తున్నా.

–జ్యోతిర్మయి(594), పిడుగురాళ్ల

ఆదర్శంగా ఉండాలని...



10వ తరగతిలో 589 మార్కులు సాధించి మాచవరం మండలం ఫస్ట్ వచ్చాను. అలాగే ఐఐటీలో కూడా మంచి ర్యాంక్ సాధించి మా పాఠశాలకు, మా గ్రామానికి మంచి పేరు తీసుకొని వస్తా. భవిష్యత్‌లో నలుగురికి ఆదర్శంగా ఉండే విధంగా చదువుతాను.

– మూలగుండ్ల సాక్షితారెడ్డి, మోర్జంపాడు, మాచవరం మండలం

ఇంజినీర్ కావాలని..



నేను 10వ తరగతిలో 592 మార్కులతో దాచేపల్లి మండలం ఫస్ట్ వచ్చాను. అలాగే ఇంజినీరింగ్ ఇవ్వటం తన లక్ష్యం. మరింత కష్టపడి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటాను. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చేందుకు కృషి చేస్తా.

– వై. ప్రణీత్, దాచేపల్లి

భవిష్యత్‌లో డాక్టర్ కావాలని ఉంది



పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు ఇటువంటి అభినందన సభ నిర్వహించటం చాలా ఆనందంగా ఉంది. భవష్యత్‌లో కూడా బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించి డాక్టర్ అవుతాను. సమాజంలో సేవ చేసే అవకాశాన్ని సాధిస్తా.

– బి.అమూల్య(586), గురజాల

అన్ని ట్రెజరీ కార్యాలయాలు కంప్యూటరీకరణ



మాట్లాడుతున్న ఖజానా అధికారి శ్రీనివాసరావు

మాచర్ల: పల్నాడు జిల్లాలోని తొమ్మిది ఉప ఖజానా కార్యాలయాలను కంప్యూటరీకరణ చేసి పెన్షన్‌దారులకు వివిధ ప్రభుత్వ శాఖల వారికి ఉత్తమ సేవలందించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు పల్నాడు జిల్లా ఖజానా అధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం పట్టణంలోని ఉప ఖజానా కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించి ఆడిట్ నిర్వహించారు. అనంతరం స్థానిక ఉప ఖజానాధికారి కేతావత్ రామానాయక్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. పింఛన్‌లు ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా అన్నీ రకాల సేవలను కంప్యూటరీకరణ చేసి ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు తెలిపారు. మాచర్ల పట్టణంలోని నూతన ఉప ఖజానా కార్యాలయానికి ఐదు సెంట్ల భూమిని పెన్షనర్స్ అసోసియేషన్ భవనం ఎదురు కేటాయించినట్లు చెప్పారు. త్వరలో అంచనాలు పూర్తి చేస్తామన్నారు. పెన్షనర్స్‌కు ఏమైనా సమస్యలుంటే తనకు నేరుగా ఫోన్ చేయవచ్చునన్నారు. ఎటువంటి సమస్యలున్నా, పరిష్కరించి పెన్షన్‌దారులకు, బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్‌ఏల సంఘ నాయకులు శ్రీనివాసరావు, రామారావు

మాచర్ల రూరల్: వీఆర్‌ఏల పై అధిక పనిభారం మోపుతూ ఇతర ఉద్యోగ బాధ్యతలను వెంటనే నిలిపివేసి విద్యార్హత ఆధారంగా ప్రమోషన్లు అందించి ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులైన వీఆర్‌ఏలతో భర్తీ చేయాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్ వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జీతాలు పెంచుతామని చెప్పి వాటిని అమలు పర్చటంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నైట్ డ్యూటీలు, ఇసుక, రైస్ మిల్లుల వద్ద డ్యూటీలు వేస్తూ అధిక పని భారం వేయటం తగదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇస్తున్నట్లు నామినీలతో సహా పే స్కేల్ చెల్లించాలని, ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ పోస్టులలో అర్హులైన వీఆర్‌ఓలతో భర్తీ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎం.శ్రీనివాసరావు, బొనిగె ఆనందరాజు, మాచర్ల శిరీష, తీగల రామారావు పాల్గొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు కన్నీటి వీడ్కోలు..



కానుకమాత చర్చిలో పవిత్ర సమిష్టి దివ్యపూజా బలిని సమర్పిస్తున్న గుంటూరు బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య

రెంటచింతల: ప్రపంచ కథోలిక సంఘం అధిపతి, వాటికన్ సిటీ సార్వభౌమాధికారి పోప్ ఫ్రాన్సిస్‌కు ప్రపంచంలోని క్రైస్తవులందరూ కన్నీటి వీడ్కోలు పలికారని గుంటూరు బిషప్ (పీఠాధిపతి) చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. శనివారం కానుకమాత చర్చిలో పోప్ ఫ్రాన్సిస్ ఆత్మకు నిత్య విశ్రాంతి ప్రసాదించాలని కోరుతూ రెంటచింతలలో ఉన్న 12 మంది విచారణ గురువులతో ఆయన పవిత్ర సమిష్టి దివ్య పూజాబలిని సమర్పించి మాట్లాడారు. 2013 మార్చి 13 న 266వ పోప్‌గా ఎన్నుకోబడిన ఫ్రాన్సిస్ పోప్‌గారు తన పాపసీ మొత్తం కూడ సామాజిక న్యాయం, పేదలపై నిబద్ధతతో పాటు కాథలిక్ చర్చిని సంస్కరించడానికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. పోప్ ఫ్రాన్సిస్ వినయం, సరళత, మత సంబంధమైన విధానం కోసం పాటు పడ్డారని చెప్పారు. ప్రపంచానికి చేసిన సేవలను గుర్తుచేసి కొనియాడారు. వారి వలే సేవాభావాన్ని, తగ్గింపు తనాన్ని ప్రతి క్రైస్తవుడు కలిగి ఐక్యమత్యంగా జీవించాలని కోరారు. కానుక మాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ దివ్యపూజాబలిలో విచారణ గురువులు ఏరువ బాలశౌర్రెడ్డి, మర్రి అనిల్, కోడిగంటి నిఖిల్ తేజ, పుష్పరాజ్, పవిత్రన్, పూదోట బాల చందు, పి. రత్నబాబు, కాకుమాను కిరణ్ సాగర్, రత్నకుమార్, సహాయ గురువులు జి. అగస్టీన్, ఫాదర్ కొణతం ఎలీషారాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగిపై దాడి దుర్మార్గం

- సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్
- సత్తెనపల్లిలో నల్ల బ్యాడ్జీలతో గ్రామ రెవెన్యూ సహాయకుల నిరసన



నిరసనలో గ్రామ రెవెన్యూ సహాయకులు, సీఐటీయూ నాయకులు

సత్తెనపల్లి: విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగి మీద దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్ ఖండించారు. అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం గాదెల గ్రామ వీఆర్‌ఏ పెంచలయ్యపై శుక్రవారం జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ పల్నాడు జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకులు నల్ల బ్యాడ్జీలతో సత్తెనపల్లిలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ తక్షణమే దాడి చేసిన వ్యక్తి మీద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ రెవెన్యూ సహాయకుల పల్నాడు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ వీఆర్‌ఏల మీద ఇటీవల దాడులు పెరిగాయని, వారికి రక్షణ కల్పించాలని కోరారు. పల్నాడు జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం గౌరవాధ్యక్షురాలు మల్లేశ్వరి మాట్లాడుతూ దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకుల అసోసియేషన్ సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి ముస్తఫా, బెల్లంకొండ మండలం అధ్యక్షుడు సుందరరావు, కార్యదర్శి ఆంజనేయులు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ హార్మోనిస్టు షేక్ ఖుదావన్‌కు నివాళి

క్రోసూరు: స్థానిక జెడ్పీ హైస్కూలులోని కళాక్షేత్రంలో సోమవారం ప్రముఖ హార్మోనిస్టు షేక్ ఖుదావన్ వర్ధంతి సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాబంధు బి.గోపాలకృష్ణసాయి శనివారం తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు సభ, ఆపాత మధురాలు ఆర్కెస్ట్రా, నర్తనశాల హరికథ, నాన్నా-నేనొచ్చేస్తా నాటిక, సంఘ సంస్కర్త కాళ్లకూరి నారాయణరావు రచించిన భక్త చింతామణి పూర్తి నాటకం ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి కార్యకర్తకు వైఎస్సార్ సీపీ అండ

పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



తాళ్లపల్లిలో ప్రమాదంలో గాయపడిన లక్ష్మీనారాయణ, లక్ష్మయ్యలను పరామర్శిస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల రూరల్: వైఎస్సార్ సీపీ వెంట మొదట నుంచి కష్టనష్టాలలో ఉంటున్న ప్రతి ఒక్క కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని, ఎవరూ అధైర్యపడవద్దని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం రాత్రి మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో ప్రమాదంలో గాయపడిన బీర్ల లక్ష్మీనారాయణ, పోరుమళ్ల లక్ష్మయ్య కుటుంబాలను పరామర్శించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అలవి కాని హామీలిచ్చి ప్రజలను మరోసారి మోసం చేసిందని, ఈ మోసపూరిత, దౌర్జన్య ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎవరూ అధైర్యపడకుండా పార్టీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షులు పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, సర్పంచి యంగ్ర గాలయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు బూడిద సైదులు, జూకూరి వెంకట్రామయ్య, శివయ్య, ఎంపీటీసీ పి మల్లయ్య, పుట్టా బ్రహ్మయ్య, పాపయ్య, కొప్పుల రామ్మూర్తి, ఉల్లి నారాయణ, పరమేశ్వర రావు, దేరంగుల గురవయ్య, శ్రీనివాసరావు, ఏడుకొండలు, ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు గిరిజన ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న గిరిజన నాయకులు

మాచర్ల: పల్నాడు జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలలో నివాసముండే గిరిజన, చెంచుల సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రత్యేకంగా మాచర్ల నియోజకవర్గంలోని పట్టణంలో సాగర్ రోడ్డులోని వైభవ్ ఫంక్షన్ హాలులో గిరిజనుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు రాష్ట్ర గిరిజన సంఘ నాయకులు మండ్లి పెద్ద మల్లు స్వామి, ఉమ్మడి జిల్లా గిరిజన సంఘ నాయకులు నూన్సావత్ రంగానాయక్ తెలిపారు. శనివారం విలేకరులతో గిరిజన కార్యాలయంలో మాట్లాడారు. దాదాపుగా పల్నాడు జిల్లాలో అనేక తండాల్లో, చెంచు కాలనీల్లో సమస్యలున్నాయని, ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీటి పై ఆత్మీయ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ కమిటీ సభ్యులు వడితె శంకర్ నాయక్ హాజరవుతారని చెప్పారు. విలేకరుల సమావేశంలో గిరిజన నాయకులు బాలాజీ నాయక్, సూర్యనాయక్, గంగయ్య పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి

ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

పెదకూరపాడు : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెదకూరపాడు ఎక్సైజ్ శాఖ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కాకతీయ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు డ్రగ్స్, మద్యం, సారా వలన కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. కుటుంబాలు ఆర్థికంగా నష్టపోటమే కాకుండా అనారోగ్యం పాలవుతారని తెలిపారు. అనంతరం ఎస్‌ఐ పేరు సాహెబ్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీనివాసరావు, రవికుమార్, హనుమంతు, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ బాబు, కరీం పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో..

మత్తు పదార్థాల వల్ల శరీరంలోని అన్ని వ్యవస్థలు దెబ్బ తింటాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సీఐ పి. విజయ్ కుమార్ తెలిపారు. మద్యపానం, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై కంటెపూడి సమీపంలోని నలంద ఇంజినీరింగ్ కళాశాలలోని ఫార్మసీ విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులంతా మద్యానికి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు చెప్పే మంచి విషయాలను పాటించాలని తెలిపారు. జీవితంలో మంచి లక్ష్యాలను ఏర్పరచుకొని విద్య ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. అనంతరం మద్యపానానికి, డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో ఎస్‌ఐ కె.నాగ లక్ష్మి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ స్టేషన్ సిబ్బంది నరసింహారావు, దాసు, ఖాజా, హనుమ, ఆనంద్, నలంద కళాశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

బెల్లంకొండలో..

యువత మత్తుకు బానిసలై జీవితాలను పాడు చేసుకోవద్దని క్రోసూరు ఎక్సైజ్ సీఐ తులసి తెలిపారు. శనివారం మండలంలోని వెంకటాయపాలెంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు





గాయపడిన నాగేశ్వరరావు, సుధాకర్

పెదకూరపాడు: మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ అదుపు తప్పి ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని అబ్బరాజుపాలెంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. క్రోసూరు మండలం హసనాబాద్ గ్రామానికి చెందిన మల్లెల నాగేశ్వరరావు, సుధాకర్ రెండు ద్విచక్ర వాహనాలపై కృష్ణా జిల్లా మైలవరంలో జరిగిన వివాహానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా పెదకూరపాడు మండలం అబ్బరాజుపాలెం గ్రామ సమీపంలో చెరువు కట్ట వద్ద వాహనాలు అదుపుతప్పి రెండూ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సుధాకర్, నాగేశ్వరరావులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం మేరకు 10 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఈ నెల 30వరకు ఈకేవైసీకి అవకాశం

మాచర్ల: మండల, పట్టణానికి చెందిన రేషన్ కార్డు కలిగి, ఆ కార్డులో ఉన్న ప్రతి సభ్యుడు ఈ నెల 30వ తేదీ లోగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ బి.కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈకేవైసీ చేయించుకోకపోతే మే నుంచి రేషన్ నిలిపివేయటం జరుగుతుందనే విషయాన్ని గమనించాలని చెప్పారు. రేషన్ డీలర్ల వద్ద కానీ, మొబైల్ వ్యాన్‌ల వద్ద కానీ ఈకేవైసీ చేయించుకోవచ్చని పేర్కొన్నారు.

జూలై 5కు వాయిదా పడిన జాతీయ లోక్ అదాలత్

గురజాల: జాతీయ లోక్ అదాలత్ మే 10వ తేదీకి బదులు జూలై 5వ తేదీన నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, పదో అదనపు జిల్లా జడ్జి జి.ప్రియదర్శిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఉంటుందని చెప్పారు. అదాలత్‌లో రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, భూ తగాదాలు, బ్యాంకు కేసులు, చెక్‌బౌన్సు కేసులు, పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

మాచర్ల: విద్యుత్ వినియోగదారులు ఆదివారం సెలవు రోజు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు ఏఈ కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఆర్వో కౌంటర్‌లు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. వినియోగదారులు గమనించి పాత బకాయిలు, ప్రస్తుత బిల్లులు చెల్లించి సహకరించాలని కోరారు.

ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

మాచర్ల: పట్టణంలోని శ్రీశైలం రోడ్డులోని స్వామి వివేకానంద సేవాశ్రమంలో మే 2 నుంచి 31వ తేదీ వరకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మెట్టు గోవిందారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10 వరతరగతి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, నైతిక ఆధ్యాత్మికతపై విద్యార్థులకు తరగతులు ఉంటాయని చెప్పారు. వివరాలకు 94400 68131, 93461 62835 సంప్రదించాలని కోరారు.

నేడు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

పిడుగురాళ్ల: వక్ఫ్ బోర్డు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆదివారం పిడుగురాళ్ల పట్టణంలో పిడుగురాళ్ల ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ ర్యాలీ ఉదయం 10 గంటల పట్టణంలోని మర్కస్ మసీదు(పెద్ద మసీదు) వద్ద నుంచి ఐలాండ్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ జరుగుతుందని చెప్పారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



నకరికల్లు: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ పల్నాడు జిల్లా ఎస్ఈ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని చల్లగుండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం ఆయన తనిఖీలు చేపట్టారు. సబ్‌స్టేషన్ ఆపరేటింగ్ సిస్టమ్, ట్రాన్స్‌ఫార్మర్‌లు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా రెండవ శనివారం విద్యుత్ లైన్‌లకు మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. విద్యుత్ బకాయిలను నూరుశాతం వసూలు చేయాలని చెప్పారు. నూతన సర్వీసుల కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే మంజూరు చేయాలని ఆదేశించారు. అదనపులోడును 50శాతం రాయితీతో క్రమబద్ధీకరించేందుకు ఆదేశాలు ఉన్నాయన్నారు. ఈ మేరకు జూన్ 30లోగా వినియోగదారులకు అవగాహన కల్పించి క్రమబద్ధీకరించాలని తెలిపారు. గృహ, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఏర్పడే ఇబ్బందులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని చెప్పారు. వినియోగదారులకు, రైతులకు ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పని చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డీఈఈ బి.వెంకటేశ్వరరెడ్డి, నకరికల్లు ఏఈ షేక్ గౌస్, లైన్‌మెన్‌లు ఉన్నారు.